# రాజీ

సోమిరెడ్డి జయప్రద & సోమిరెడ్డి జమున

ఆంధ్రజ్యోతి, 1982

---

సంసార జీవితంలో ఆనందమంతా
సర్దుబాటు మనస్తత్వంలోనే వుంది
– జయప్రద

---

మధ్యలో మరో స్టాప్ – ఆ తర్వాత స్టాప్‌లో తను దిగాలి. చాలా ఆనందంగా వుంది శ్యామ్‌శేఖర్‌కు. అతను దేవాలయాలమీద రీసెర్చి ప్రారంభించాడీమధ్య. కాళహస్తి చాల పెద్దదే అయినా, ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటికిగాని వీలుకాలేదు ఇక్కడికి రావడానికి.

శ్యామ్‌శేఖర్ ఆనందం కాళహస్తీశ్వరుణ్ణి చూడబోతున్నందుకు కాదు, అక్కడేదో తను క్రొత్తగా కనిపెట్టబోతున్నందుకూ కాదు – ఆ చిన్న ఊరిలో తన స్నేహితులిద్దరున్నారు. ఒకరు తను ప్రీ-యూనివర్శిటీ చదివేరోజుల్లో క్లాస్‌మేట్ సుహాసిని, రెండవ వ్యక్తి ఎం. ఎ. ఆఖరి సంవత్సరంలో వున్నపుడు రూమ్‌మేట్ సురేంద్ర – ఇద్దరూ తనకు చాల ఆత్మీయులే.

పదహారు సంవత్సరాల వయసులో ఆకర్షణ కతీతంగా సుహాసిని తననెంత అభిమానించేదో పాతిక సంవత్సరాల వయసులో బాధ్యతల మధ్యగా సురేంద్రకూడా అంతే అభిమానించేవాడు. వాళ్ళిద్దరి అభిమా

నాల్ని, ఆత్మీయతల్ని మూటగట్టుకొని భద్రంగా ఈనాటికీ దాచుకోనున్నాడతను. తరచుగా క్షేమ సమాచారాలతో ఉత్తరాలు వాళ్ళమధ్య జరుగుతున్నా ఒకరినొకరు చూసుకొని, మనసులు విప్పి మాట్లాడుకోవాలనే కోరిక వాళ్ళమధ్య బలంగావున్నా, ఎవరి జీవితాలు వాళ్ళవి. ఆ బంధాలలోనుంచి బయటపడటం అంత సులభమైన విషయం కాదు.

మరలా బస్ బయలుదేరింది.

సురేంద్ర ఎలా వున్నాడో! వాడు సమర్థుడు. తన జీవితాన్ని తన కిష్టమొచ్చినట్టు మలచుకునే వుంటాడు.

"సుహాసిని ఎలా వుందో! ఎప్పటిమాట! తను ఆమెను చూసి అప్పుడే ఎనిమిదేళ్ళయిపోయింది. ఆమెకు పెళ్ళయి కూడా అయిదేళ్ళయిపోయింది. చల్లగా మనోహరంగా నవ్వే ఆమె నవ్వులో కొత్తగా పెద్దరికం చోటుచేసుకోనుండుంటుంది."

తన ఆలోచనలకు తానే చిన్నగా నవ్వుకున్నాడు శ్యామ్‌శేఖర్. మరో గంటలో వాళ్ళను తను చూడబోతున్నాడు. కానీ చిత్రం. ఇన్ని సంవత్సరాలుగా లేని ఆతృత ఈరోజు తన్ను కుదిపేస్తోంది.

అలా అనుకుంటూ తన ఆలోచనల్ని తను కంట్రోలు చేసుకోడానికి ప్రయత్నించేకొద్దీ అతన్ని పాత జ్ఞాపకాలు యింకా చుట్టేస్తున్నాయి.

"శ్యామూ! నీలాంటి వాణ్ణెవరినైనా చూసి మా సుహాసినికి తొందరగా పెళ్ళిచేయాలి!" అనేది గుప్తంగా సుహాసినీ వాళ్ళమ్మ.

"ఛీ. శ్యామూలాటి వాళ్ళనా - చస్తే చేసుకోను. శ్యామూలా నల్లగానా! ఉహుఁ నేను చేసుకోబోయేవాడు చాల పచ్చగా వుండాలి. కనీసం ఐదూ పదకొండైనా హైట్ వుండాలి బలంగా, ఠీవిగా, దర్జాగా వుండాలి. కార్లో తప్ప ఇక దేంట్లోనూ తిప్పకూడదు నన్ను" చాలా నిర్మొహమాటంగా చెప్పే కూతుర్ని విసుక్కునేది వాళ్ళమ్మ.

"ఛీ! నోర్మూయ్. పది జన్మలెత్తితేమటుకు శ్యామూలాటి మంచి మనసున్నవాడు దొరుకుతాడా!"

"నో మమ్మీ. మొగుడనేవాడు మనం చెప్పేదంతా వినకూడదు. అలా వింటే జీవితం చప్పగా వుంటుంది. ఈమధ్య నేనో నవల చదివి నీ కివ్వలా గుర్తుందా? ఆ నవలలో హీరో చూడు భార్యను ఎంత ప్రేమిస్తాడో - అంత శాసిస్తాడు. ఆ డామినేటింగ్ నేచర్ చేసుకునేవాడిలో లేకపోతే భార్యకు బాగుండదు."

"చాల్లే – నిండా పదహారేళ్ళు లేవు అన్ని కబుర్లు చెప్తున్నావు."

"పదహారేళ్ళపుడేకదూ మమ్మీ పెళ్ళి గురించి ఆలోచించాలి" అని అల్లరిగా నవ్వే కూతుర్ని విసుగ్గా చూసేదామె.

"మమ్మీ! భర్త అంటే ఎలా వుండాలంటే చూడగానే కళ్ళతో పలకరించాలి. నొసలు విచ్చుకోకుండానే నవ్వినట్లుండాలి. క్రాప్ దువ్వడంలోనే ఆ తలకు అందం రావాలి. టక్ చేయాలి. టై కట్టాలి. వైట్ ప్యాంట్ - వైట్ షర్టు ఇన్‌షర్టుచేసి నిగనిగలాడే బూట్‌లో, ఓహ్ బెంగాలీ హీరోలా వుండాలి. నడక చాల స్టైయిల్‌గా వుండాలి. పేరు పిల్చుకోడానికి అనువుగా వుండాలి. అన్నిటికంటే ముఖ్యం ఆ అబ్బాయికి నా ప్రపంచంతప్ప వేరే వుండకూడదు...."

"ఏం మమ్మీ అలా అయిపోయావ్?"

"పెళ్ళి గురించి ఆలోచించొచ్చుగానీ కలలుకనడం మంచిదికాదే సుహాసినీ. ఇవి నవలలు కావు ఎలా ఇష్టంవస్తే అలా వ్రాసుకోడానికి. మన స్తోమతకి నీకు కారున్నవాడు అందగాడు వస్తాడని ఊహించడం ఆరోగ్యానికి మంచిదికాదు" అనేసి ఆమె లోపలికెళ్ళేది.

ఇంచుమించుగా అదే కాకపోయినా ఇలాటి వాగ్యుద్ధమే అప్ప

దప్పుడూ అమ్మా కూతుళ్ళమధ్య జరుగుతూ వుండేది. తను కేవలం శ్రోతలా మిగిలిపోయేవాడు. తనకి సుహాసినిని పెళ్ళి చేసుకోవాలనే కోరిక లేకపోయినా తన స్నేహితురాలు తనని అలా కించపరచి మాట్లాడడం కాస్త బాధగానే వుండేది. మరలా ఆమె చూపే నిజమైన ఆప్యాయతతో అన్నీ మర్చిపోయేవాడు.

సుహాసిని ఎంత కలల్లో బ్రతికేదో అంత వివేకి కూడా. కొన్ని రోజుల తమ స్నేహం తర్వాత పనిలేనివాళ్ళు తామిద్దరిమధ్య అక్రమ సంబంధాన్ని అంటగట్టినపుడు—

"శ్యామూ! నిన్ను నేను అన్నా! అని పిలుస్తాను" అంటే తను నివ్వెరపోయాడు.

"అదేం! అలా మన స్నేహానికి పేరు పెట్టకపోతే ఏం?" అన్నాడు తను.

"తప్పదు శ్యామూ! ఈ లోకానికి చెవులేకాని ఆలోచనా జ్ఞానం వుండదు. మనిద్దరి మధ్య వుండే స్నేహభావాన్ని అర్థం చేసుకునేంతగా వీళ్ళు ఎదగలేదు. అది కూడా వాళ్ళ తప్పుకాదు. మన సమాజం అలా వుంది. 'అన్నా!' అని పిలిచి మన బాంధవ్యం ఇలాటిది అని చెప్పకోక తప్పడం లేదు."

* * *

"మాస్టారూ! తప్పుకుంటారా!" ఉలిక్కిపడి చుట్టూ చూశాడు శ్యామ్. బస్ ఆగుంది. అది కాళహస్తి. నవ్వుకుని లేచి నిల్చొన్నాడు. బస్ అవతల తనని ఆహ్వానించడానికి కాళహస్తి దేవాలయం ధర్మకర్త. తప్పదు తను నేరుగా తన స్నేహితుల్ని కలుసుకోడానికి వీలులేదు. మొదట వీళ్ళ ఆతిథ్యాన్ని తను స్వీకరించి తీరాలి. కొద్ది అయిష్టంగానే వాళ్ళతో కదిలాడు శ్యామ్.

* * *

## 2

"ఏమండోయ్ శ్రీవారూ! లేవాలి మీరు. ఈరోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేయించాలి. మీరు తల స్నానంచేసి అదిగో అక్కడ పట్టుపంచె పెట్టాను కట్టుకునీ—"

"అయ్యో! ఆదివారం మీనా ఈ రోజు. ఎంచక్కా నీవు కూడా ఈ దుప్పట్లో దూరేయ్. ఆదివారం సార్థకమైపోతుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సంగతి రేపు చూసుకుందాం లెద్దూ. ప్లీజ్."

"అయ్యో! అవేం పాడు మాటలండీ ప్రొద్దున్నే. అసలే ఈ రోజు యంత్రాన్ని...."

"యంత్రమా? ఏం యంత్రం మీనా....ఓహ్! అప్పుడడిగే దానివిగా బట్టలుతికే మిషన్ - ఇన్‌స్టాల్‌మెంట్సుమీద కొనేశావేమిటి?" లేచి కూర్చొన్నాడు సురేంద్ర.

"పోనీలే నీకు బట్టలుతికే బాధ ... తప్పుతుంది – అన్నట్లు మీనా మీనా అమ్మ....కూడా లేదుగా....ఇక చూడూ....సరసకు రావే – సరదా తీరా...." తొడమీద తాళంవేస్తున్న భర్తను చిరుకోపంతో చూసింది మీనాక్షి.

"చాల్లెండి మీజోక్స్. అది బట్టలుతికే మిషన్‌కాదు" అక్కడితో ఆ వాక్యం ఆపి గొంతు తగ్గించింది మీనాక్షి.

"మన పక్కవీధిలో రాజేశ్వరమ్మ లేరూ! ఆమె నిన్న కంచి స్వాములవార్ని పాద పూజకు పిలిచింది. ఆయన ఆమెకో పెట్టెలో యంత్రం యిచ్చి దాన్ని పూజ గదిలో వుంచి పూజ చేయమన్నారట."

"ఆ యంత్రం ఖరీదెంతో !"

"ఖరీదా ! ఏమో తెలీదు. అయినా అలాటి మహిమగలవాటికి ఎంతిచ్చినా తక్కువే అవుతుంది. మనమూ ఒకటి తెచ్చుకుందామండీ."

"నీ కెందుకోయ్ వరాలు. అడిగే ప్రతి వరాన్నీ తీర్చే నీ దేవు డిక్కడుండగా" భార్యను లాక్కోబోయి ఘోరంగా పరాభవించబడ్డ పతి దేవుణ్ణి జాలిగా చూస్తూ.

"తప్పండీ: అలా మాట్లాడకూడదు. ఆ యంత్రానికి పూజచేస్తే మనింటికి ఏ దుష్టశక్తులూ రావట" అంది పరవశంగా మీనాక్షి. భార్య అమాయకత్వానికి సురేంద్రకు నవ్వొస్తోంది. తన భార్య బి. ఏ. "మనిల్లు మరీ ఇరుకు దేవీ ! ఆ దుష్టశక్తులు మనింట్లో మెలగలేవు. ఆ భయం నీ కక్కరలేదు."

ఈసారి మీనాక్షికి నిజంగానే కోపం వచ్చింది.

"అన్నీ వితండ వాదాలు. లేచి స్నానం చేస్తారా ! లేదా !" అంది విసుగ్గా.

"అలాగే రాణీ ! కానీ ఆత్మారాముడు తెగ గోలపెడ్తున్నాడు కాస్త కాఫీ...."

"కాఫీయా ! మతిపోతోందా ! పూజకెళ్తూ కాఫీ ఏమిటి ? లేవండీ స్నానం చేద్దురుగానీ" మరలా బ్రతిమిలాడ్డంలోకి జారిపోయింది మీనాక్షి.

ఇక భార్యను కాదనే శక్తి సురేంద్రకు లేదు.

* * *

"మీనా ! పట్టుచీర, కాసులపేరు, ఆ ముఖానికి పసుపు లేకపోతే మీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడిలోకి రానీడా ఏంటి ?"

"అబ్బ! మీతో ఎలా? అయినా ఎన్నిసార్లు చెప్పాలి మీకు మధుర మీనాక్షిదేవి పేరును అలా 'మీనా' అని పిలవకూడదని."

"హతోస్మి."

సుబ్రహ్మణ్యస్వామి కోవెలలో అడుగుపెట్టేసరికి సురేంద్రకు ముచ్చెమటలు పోశాయి. 'వీళ్ళకంతా పూజ లెప్పడయ్యేది? నేనింటి కెళ్ళి టిఫిన్ ఎప్పుడు తినేది?' అని ...

"ప్రతి వారం పూజ పేర గుడికి వస్తుంటావు కదా! ఏదైనా స్పెషల్ రెకమెండేషన్ చేసి వాళ్ళనంతా వెనక్కు నెట్టి నీవు మొదట అభిషేకం చేయించుకోలేవా!" దీనంగా అడిగాడు.

"నే నొక్కదాన్నేనా? వీళ్ళంతా కూడా ప్రతి వారం పూజ చేయిస్తారు .. రండి....రండి నవగ్రహాలకు ప్రదక్షిణం చేద్దాం."

"మరలా అదొకటా....."

"మీ దేముడు భక్తులకు మంచి ఎక్సర్ సైజ్ ఇచ్చాడే."

"హుష్ మాట్లాడకండి. ప్రదక్షిణంచేస్తూ మాట్లాడొచ్చా!"

ఆవిడ అభిషేకం పేరుతో వంద రూపాయలు ఖర్చుపెట్టి తెచ్చిన సామగ్రి అంతా ఆ పూజారి దోసిట్లో పెట్టడం, సురేంద్ర మనసు ఉసూరు మనడం రెండూ జరిగిపోయాయి. మనుష్యులే చిక్కటి పాలకు వాచిపోతే గుళ్ళో శిలకు చిక్కటి పాలు – చిక్కటి పెరుగుతో తలస్నానం చేయించేశారు. ఆ గర్భగుడిలో ఎంత మురికి పేరుకుపోయిందోగాని గుప్పున ముంజువాసన ఒక్కమారుగా ఇంటిమేట్ సెంట్ పూర్తిగా స్ప్రే చేసినట్లు అంతా వెదజల్లింది. అసంకల్పితంగా జేబిలో చేతిగుడ్డ ముక్కుకు అడ్డం పెట్టేసుకున్నాడు సురేంద్ర.

భక్తులంతా అతిశ్రద్ధగా ఆ సువాసనలు పీలుస్తూ రెండు చేతులెత్తి

స్వామివారికి నమస్కరిస్తున్నారు. పూజారి ఆ పాలు - పెరుగు జవిరి, వాళ్ళు తెచ్చిన పాత్రలో నింపి రెండు ద్రాక్షపళ్ళు, ఓ అరటిపండు అందులో కలిపి పంచామృతం పేర భక్తుల కందిస్తుంటే భక్తిపూర్వకంగా అందుకుంటున్నారు.

దేవుడికి అలంకారం చేయాలని స్క్రీన్ వేసేసారు. పాపం సురేంద్ర ఆత్మారాముడు గగ్గోలు పెట్టేస్తున్నాడు.

# 3

"అంటరానితనమే తరలిపోతున్న ఈ రోజుల్లో నీవు నీ మొగుణ్ణి అంటరానివాడిలాచేసి ఆ కాఫీ అలా పడేసి వెళ్తున్నావ్ మీనాక్షీదేవీ !"

"ఈ రోజు ఉపవాసమండీ. మధ్యాహ్నం దేవుడి గదిలో ఫోంచేసే వరకు ఇంతే" అని వంటింట్లోకి తుర్రుమంది.

ఆదివారమంటే బ్రహ్మచారులకు చాలా ఇష్టం. తమిష్టమయినంత వరకు నిద్రపోవచ్చు. తర్వాత అలా మార్నింగ్‌షోకి వెళ్ళొచ్చు. ఆదివారం స్పెషల్ అయ్యర్ భోజనం తృప్తిగా తినొచ్చు. మధ్యాహ్నం మళ్లా ఓ నిద్ర. సాయంత్రం అందరు ఫ్రెండ్స్ కలిసి పేకాట లేదా అమ్మాయిలను చూస్తూ జంక్షన్‌లో అల్లరికబుర్లు, ఇవీ బ్రహ్మచారి ఆనందాలు.

పెళ్ళిచూపుల తతంగం మొదలయినప్పటినుంచి ఆలోచనా సరళి మారిపోతోంది.

"ఆఫీసుకు టైమ్ అవుతుందండీ త్వరగా వంటచేయొద్దా" అనే భార్యను పడక దిగనివ్వకుండా తన చేతుల్తో బంధించేయొచ్చు.

తీరిగ్గా భార్యాభర్తలిద్దరూ ఒకే కప్పులో కాఫీ స్వీట్ కబుర్లతో

పంచుకోవచ్చు. స్నానాల గదిలోనుంచి హడావుడిగా పరుగిడనక్కర లేకుండా సరసాలతో భార్య చేతులతో తలంటు పోయించుకోవచ్చు.

రోజూలా ఉడికీ ఉడకనిది వేడివేడిగా గొంతు కాల్చుకుని తిని పరిగెట్టకుండా నిదానంగా కూర్చుని ఒకరికొకరం తినిపించుకుంటూ తర్వాత తమలపాకులు భార్య నోటికందిస్తూవుంటే అఖరి భోజనఘట్టాన్ని ఇరువురు ఆనందించవచ్చు.

సాయంత్రం స్వహస్తాలతో గులాబి పువ్వులుతెచ్చి భార్యకిచ్చి, తన కోరికమేర అలంకరించుకున్న తన భార్య గులాబి పెదాలమీద సుతారంగా ముద్దుపెట్టుకుని స్కూటర్ మీద వెనుక భుజాలమీదకు భార్యచేతిని తీసుకుని గర్వంగా సినిమాకి వెళ్ళి రిజర్వ్‌డ్‌లో కూర్చుని ఆనందించొచ్చు.

రాత్రి నునుసిగ్గుతో కొత్త అందాలు పుణికి పుచ్చుకునే భార్య కౌగిట్లో తనివితీరా కరిగిపోవచ్చు – కానీ పాపం సురేంద్ర! ఆదివారం భక్తి పేరిట మీనాక్షి.

"ఇద్దరం కల్సి కాఫీ త్రాగుదాం రా డియర్" అని సురేంద్ర పిలిస్తే "ఎంగిలండీ ఈ రోజు ఆదివారం కదా !" అనే మీనాక్షి.

"మీనాక్షీ! అన్నం ఒకే కంచంలో వడ్డించేయ్ ఇద్దరికీ" శృంగారం ఒకపాలు ఎక్కువున్న సురేంద్ర కేక.

"ఈ పూట అరిటాకులో దేవునిగదిలో భోంచేయాలండీ నేను" సనాతన మూఢాచారాలకు ప్రతినిధి అయిన మీనాక్షి జవాబు.

"మీనా! వంటింట్లో సర్దడం అయ్యిందా? తమలపాకులు తీసుకునిరా"

"తమలపాకులు మీ రూమ్‌లోనే వుంచానండీ, వేసుకోండి. స్వాములవారిదగ్గర తీసుకున్న యంత్రానికి జపం చేసుకుని వస్తాను" రూములోకి రాకుండానే జవాబు.

ఇంతే సంగతులు - పాపం సురేంద్ర !

* * *

"సురేంద్రా !" వరండాలోనుంచి కేకవిని, షేవ్ చేసుకుంటున్న సురేంద్ర రేజర్ క్రింద పెట్టి "వస్తున్నా" అంటూ వరండాలో కొచ్చాడు.

ఎదురుగా శ్యామ్‌శేఖర్ సూట్‌కేస్‌తో నిల్చొనున్నాడు.

"శ్యామూ! నువ్వా ఎప్పుడురా వచ్చావు?" ఇంచుమించు కౌగిలించుకున్నాడు సురేంద్ర.

"నేను ప్రొద్దున్నే వచ్చాను - సర్‌ప్రైజింగ్ విజిట్ ఇవ్వాలనే లెటర్ వ్రాయలేదు" అంటూ చేతిలో సూట్‌కేస్ క్రింద పెట్టాడు శ్యామ్ శేఖర్.

"రారా లోపలికెళ్దాం" శ్యామ్ వారిస్తున్నా వినకుండా సూట్‌కేస్ తీసుకుని ఇంట్లోకి నడిచాడు సురేంద్ర.

"శ్యామూ ! ముందు స్నానం చేసెయ్ - ఇదిగో బాత్‌రూమ్. ఇంతలో నా షేవింగ్ పూర్తి చేస్తాను తర్వాత కబుర్లన్నీ మనవే"

"ఆఁ ఇప్పుడు చెప్పు ఎన్ని రోజులుంటావు మా వూర్లో !" అని, "మీనాక్షీ ! ఇలారా" కేకేసేడు సురేంద్ర. అప్పుడే పూజైనట్టుంది. ముఖాన పసుపు, పెద్ద కుంకుమబొట్టు, పాపిటనిండా కుంకుమ, కాళ్ళకు పసుపుతో గబగబవచ్చి కొత్త వ్యక్తిని చూసి పమిట భుజంనిండుగా కప్పుకుంది మీనాక్షి.

"వీడు నా బెస్ట్‌ఫ్రెండ్ శ్యామ్‌శేఖర్ - మన పెళ్ళికి రాలేదు - పి. హెచ్.డి. లో మునిగున్నాడు - ఈవిడ మా శ్రీమతి మీనాక్షీదేవి" అంటూ పరిచయం చేసాడు సురేంద్ర.

స్నేహితుడు ఏమైనా అనుకుంటాడనే ధ్యాసయినా లేకుండా తదేకంగా ఆమెవైపే చూస్తున్నాడు శ్యామ్‌శేఖర్.

'ఏమిటి ఇతను ఇలా చూస్తున్నాడు ! ఈయన స్నేహితునికి ఇంత సభ్యత తెలీదా !? అని విసుక్కుంటూ ఆశ్చర్యపోయింది మీనాక్షి.

అతని కనుగుడ్ల చలనం క్షణంసేపు ఆగిపోయింది. అతని ఆలోచనలు వేగంగా వెనక్కి వెళ్ళిపోయాయి.

# 4

"నో, నా వల్ల కాదు నేను అడ్జెస్ట్ కాలేను."

విపరీతంగా బాధపడిపోతూ అంటున్న స్నేహితుడివైపు ఓదార్పుగా చూస్తూ అన్నాడు శ్యామ్‌శేఖర్.

"లేదు ఇంద్రా ! ఇది జీవితం - మనం ఎప్పటికప్పుడు దానికి అడ్జస్టు అవకతప్పదు."

"ఉహుఁ" తల అడ్డంగా అసహనంగా త్రిప్పాడు సురేంద్ర.

"ఈ విషయంలో తప్ప మరి దేంట్లోనైనా రాజీపడ్తాను" నవ్వాడు శ్యామ్.

"నువ్వు రాజీపడాల్సిందీ, అడ్జస్టు కావాల్సిందీ ఇక్కడే, మరెక్కడా రాజీపడకపోయినా ఇబ్బందిలేదు — కారణం ...." స్నేహితుని మాటను మధ్యలోనే త్రుంచేశాడు సురేంద్ర.

"నో శ్యామ్ ! ఒకవేళ నాకు పూర్తిగా నచ్చినమ్మాయి దొరక్కపోతే ఇలాగే వుండిపోవడానికి నాకేం అభ్యంతరం లేదుకానీ, ఎవరో ఒకరిని పెళ్ళి చేసుకోలేను."

"పోనీ చేసుకున్నాకయినా ఆ అమ్మాయి అభిప్రాయాలతో, అభిరుచులతో నువ్వు అడ్జస్టు అవుతావా లేదా ?" స్నేహితుణ్ణి సరదాగా రెచ్చగొడ్తూ అన్నాడు శ్యామ్ - కిటికీ కర్టెన్ ప్రక్కకు తొలగించి వచ్చి కూర్చొంటూ.

"ఉహుం ఆమెను నేను మార్చుకుంటాను" అన్నాడు దృఢంగా సురేంద్ర.

"మార్చుకుంటావా ? ఎలా ?"

"మరి నా అభిరుచుల ప్రకారం ఆమె మారద్దూ, లేకపోతే అదేం సంసారం ?" ఎదురుప్రశ్న వేసాడు సురేంద్ర.

"అయితే నువ్వూ ఆమె అభిరుచుల ప్రకారం మారుతావన్నమాట" ఇంటికి ఉత్తరం వ్రాయాలని తీసిన లెటర్ ప్యాడ్‌ను ప్రక్కకుతోసి ఆసక్తిగా స్నేహితుని కళ్ళల్లోకి చూసాడు శ్యామ్.

"తప్పకుండా మారతాను. ఒకవేళ ఆమెకు నేను పూలపూల షర్ట్స్ వేసుకోవడం ఇష్టమైతే నాకిష్టం లేకపోయినా వేసుకుంటాను."

పకపక నవ్వకుండా వుండలేకపోయాడు శ్యామ్. నవ్వు ఆపాక నిదానంగా అన్నాడు !

"ఇంద్రా ! అభిరుచులంటే అవేనా ? సంసారంలో అభిప్రాయ భేదాలు సవాలక్ష వుంటాయి. ఒకరి అభిప్రాయాల్ని మరొకరు గౌరవించాలే గాని, 'నువ్వు ఇలానే వుండాల'ని శాసించడం అంత ఆరోగ్యకరమైన విషయం కాదు - నీకామె అలా వుండాలని ఎంత బలమైన కోరిక వున్నా సరే."

సురేంద్ర మాట్లాడలేదు.

ఇంతకీ ఈ అసురసంధ్యవేళ వాళ్ళిద్దరిమధ్య జరిగిన వాగ్యుద్ధానికి కారణం శశి.

శశి ఈరోజు ప్రొద్దునవరకు ఈ స్నేహితులిద్దరకూ పూర్తి అపరిచితురాలు. సురేంద్రలో ఇంత కల్లోలాన్ని సృష్టించిన అమ్మాయి ఈ ఉదయాన్నే పెళ్ళిచూపుల పేరుతో వాళ్ళముందు కూర్చుంది. ఆ పిల్ల అందంగా లేకున్నా బాగుండేది. చూడచక్కనిపిల్ల కానీ సురేంద్రకు నచ్చలేదు. ఆ పిల్ల కళ్ళల్లో మెరుపులేదట. పెదాలు నవ్వకపోయినా నవ్వినట్టులేవట, పైగా అమ్మమ్మలా అలంకరించుకుందిట.

"నీకు కాబోయే భార్య రూపం ఎలా వుండాలో చెప్పు ?" కాస్త ముందుకివంగి ఆసక్తిగా అడిగాడు శ్యామ్‌శేఖర్ కలల్లో తేలిపోతున్నట్టుగా పరవశంగా అన్నాడు సురేంద్ర.

"పొడవుగా, సన్నగా, తెల్లగా, చలాకీగా, ముఖ్యంగా నవ్వితే పెదాలు విచ్చుకోవడమేకాదు కళ్ళు మెరవాలి. సాగిన పెదాల అంచున అందాలు పొర్లాలి."

"భేష్. ఓ.కె. మరి ఆమె ప్రవర్తన ఎలా వుండాలి ?"

"ఒక్కమాటలో చెప్పాలంటే చాల మోడర్న్‌గా వుండాలి. తనలో తను కుంచించుకుపోయేలా వుండకూడదు."

రెడీమేడ్‌గా జవాబులు చెప్తున్న తన స్నేహితుని కలల బరువును అంచనావేస్తూ మరో ప్రశ్నవేశాడు శ్యామ్‌శేఖర్.

"ఆమె అభిప్రాయాలు ఎలా వుండాలి ?"

"అమ్మమ్మ భావాలు కాకుండా, అభ్యుదయ భావాలు వుండాలి దేవుళ్ళు, పురాణాలు, చెప్పింది ఆచరించకుండా తన స్వశక్తితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునేలా వుండాలి."

"ఇంద్రా ! నీకు అలాంటి అమ్మాయి దొరుకుతుందా ?" నిరాశ పడ్డాడు శ్యామ్‌శేఖర్.

యం.యస్‌సి., అయ్యాక దారులు వేరయ్యాయి. సురేంద్ర ఉద్యోగంతో చేరిపోతే, శ్యామ్‌శేఖర్ విద్యాకాంక్షను ప్రక్కకు నెట్టలేక పి.హెచ్.డి. లో మునిగిపోయాడు.

ఒక సంవత్సరం తర్వాత స్నేహితుడి దగ్గరనుండి హఠాత్తుగా పెళ్ళి శుభలేఖ రావడం - ఆనందాన్ని, దుఃఖాన్నికూడా తెచ్చింది రీసెర్చి వర్కు మీద టూర్ వెళ్ళి వచ్చేసరికి ఆ ఇన్విటేషన్ కార్డుస్వాగతం పలికింది రూమ్‌లో. అప్పటికే తన స్నేహితుని పెళ్ళి జరిగిపోయి యిరవై రోజులు గడిచిపోయింది.

ఎదురుగా స్నేహితుని భార్య విసుగు ముఖం కన్పించగానే తన తప్పు తెలుసుకుని చూపులు త్రిప్పుకున్నాడు శ్యామ్‌శేఖర్.

"శ్యామూ ! మా శ్రీమతి వంట బాగాచేస్తుంది ఓ పది రోజులిక్కడ హాయిగా వుండిపోవచ్చు."

మీనాక్షి నవ్వింది. వెంటనే ఆమె కళ్ళల్లోకి చూశాడు శ్యామ్. ఆ కళ్ళు మెరవలేదు. చప్పున అతనికి తాము చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ రోజుల్లో వయస్సులో వున్న ఏ అమ్మాయిని చూసినా ఒక రకమైన ఉద్వేగంగా వుండేది.

ఒకరోజు ఏమీ తోచక తనూ, సురేంద్ర ఇద్దరూ కల్సి సినిమాకు బయలుదేరారు. హాస్టల్ ప్రక్కనేవున్న మునిసిపల్ కుళాయిలో ఒక అమ్మాయి బహుశా కూలినాలి చేసుకునే అమ్మాయిలా వుంది. పంటితో పీళ్ళు తీసుకునివెళ్తూ వచ్చి "గంటెంతయింది బాబూ ?" అంటూ సురేంద్ర నడిగింది.

అంతే. వీడు ఆ అమ్మాయికి గంట చెప్పకుండా ఆ పిల్ల కళ్ళల్లోకి తదేకంగా చూస్తూనే వున్నాడు.

ఆ పిల్ల రెండు సెకండ్లు వెర్రిగా చూసి తెలుగురాదల్లే వుంది అనుకుంటూ కదిలింది.

"ఆగాగు నీ కళ్ళల్లో మెరుపును ఇంకాసేపు చూడనీ" అన్నాడు వయసు తెచ్చే తొందరపాటులో సురేంద్ర..

ఆ పిల్ల బాగా అభిమానస్థురాలిలా వుంది. తన పంటిలోని నీళ్ళంతా ఒక్కమారుగా సురేంద్ర నెత్తిన కుమ్మరించి "కైపు దించుకో" అంటూ చరచర వెళ్ళిపోయింది.

*　　*　　*

"ఆఁ ఇప్పుడు చెప్పు ఏమిటి కబుర్లు ?" అని ఆనందంగా అడుగుతున్న స్నేహితుడి చెయ్యి పట్టుకుని.

"ఇక్కడ కాదు అలా స్వర్ణముఖిలో కూర్చొని మాట్లాడుకుందాం" అని లేచి నిల్చున్నాడు శ్యామ్‌శేఖర్. అతనికి చాల ఆశ్చర్యంగా వుంది. మీనాక్షి ప్రవర్తన తన స్నేహితుని ముఖంలో తృప్తి అతనికి చాలా వింతగా అగుపిస్తున్నాయి.

ఇసుకలో కూర్చుని తన చెప్పులు ప్రక్కన పెడ్తూ ఆనందంగా అన్నాడు సురేంద్ర.

"ఏవిటి కథా ? ఏదైనా ప్రేమ వ్యవహారమా ?"

"అలాంటిదేకానీ, నాది కాదు." అని నవ్వి,

"సూటిగా అడుగుతున్నాను ఏమీ అనుకోకు. మీనాక్షిగార్ని నువ్వు ఇష్టపడే చేసుకున్నావా ?" అన్నాడు.

ఇష్టపడే చేసుకున్నట్టు చిరునవ్వుతో తలాడించాడు సురేంద్ర.

"ఆమెతో నీ జీవితం తృప్తిగా వుందా?"

తృప్తిగా వుందన్నట్టు కళ్ళు ఆర్పి తెరిచాడు.

"గుడ్ - నాకు చాలా ఆనందంగా వుంది కానీ - నువ్వు మారావు. ఆ మార్పుకు కారణం నాకు కావాలి" అని ఆగి,

"ఇంద్రా! ఇది కేవలం కుతూహలం. నువ్విలా వుండడమే నాకిష్టం" అన్నాడు కాస్త వెనక్కి వాలుతూ.

తన జీవితాన్ని తిరగతోడుకుంటున్నట్టుగా చెప్పడం మొదలెట్టాడు సురేంద్ర.

"ఆ రోజు మామూలు ప్రకారమే చిరాగ్గా పెళ్ళి చూపులకెళ్ళాను నాకు తెలుసు ఎలాగూ ఆ — అమ్మాయి నాకు నచ్చదు — కానీ చిత్రం ఆ అమ్మాయి నాకు నచ్చింది - ఆమె కళ్ళల్లో మెరుపు — చిరునవ్వులో సౌందర్యం. కానీ ఆమె పేరు మధురమీనాక్షీదేవి — అదే నచ్చలేదు. బాగా ఆలోచించాను. పేరు మార్చుకోవచ్చులే అని ఆమెతో నా జీవితాన్ని ముడి పెట్టుకోడానికి అంగీకరించాను."

"కళ్ళల్లో మెరుపా?" అని ఆశ్చర్యపోకుండా వుండలేకపోయాడు శ్యామ్‌శేఖర్.

నవ్వాడు సురేంద్ర! "నిజమే! నీకా మెరుపు కన్పించదు. ఎప్పుడో గానీ అది కనిపించదు. అదీ నాకే — అయినా జీవితంలో బరువులూ — బాధ్యతలూకదూ!"

ఆ విషయంలో స్నేహితుడి జవాబుతో ఏకీభవించాడు శ్యామ్‌శేఖర్ "కానీ ఇంద్రా! ఆమె పేరయినా నువ్వు మార్చుకోవాల్సింది!" స్నేహితుని కోర్కె తెల్సిన శ్యామ్ అడగకుండా వుండలేకపోయాడు.

క్లాసులోనే ఆడపిల్లకు ఏదైనా పాతపేరుంటే క్రొత్తరకం పేర్లు పెట్టుకుని ఆనందించేవాడు సురేంద్ర.

"చూడు శ్యామ్, ఆ పేరు నాకిష్టంలేదు. చెప్పాగా పేరు మార్చుకో వాలనుకున్నాను. కానీ ఆ తర్వాత ఎందుకనో ఆ అమ్మాయి నాదయినంత మాత్రాన ఆ పిల్ల ఇన్నాళ్ళుగా పిలవబడ్డ పేరును మార్చే అధికారం నాకు లేదనిపించింది. అందుకే మీనా! అని పిలవటం అలవాటు చేసుకున్నాను ఇష్టం లేకపోయినా"

నిశ్శబ్దంగా వింటున్నాడు స్నేహితుడు "కానీ శ్యామూ! మా మీనాక్షికి నేను 'మీనా' అని పిలవటంకూడా ఇష్టం వుండదు."

"అదేంటండీ మధుర మీనాక్షీదేవి పేరును అలా పిలవచ్చా ఆ తర్వాత మీకేమైనా హాని జరిగితే నేను బ్రతగ్గలనా? అంటుంది" అని ఆగి——

"అదే....ఆ ప్రేమే నన్ను కట్టేస్తుంది శ్యామూ! పూజల విషయం లోనూ అంతే. ఆ దేముడు, ఆ పూజలూ మా సంసార జీవితంలో సగం సుఖాన్ని దోచేస్తున్నా, ఆమె నా శుభం కొరకు, నా కొరకు ఇవన్నీ చేస్తుందనే భావం. నన్ను వాటిని ఆపనీకుండా చేస్తోంది. వాటన్నిటి వెనకాల ఆమెకు నా మీదుండే ప్రేమభావం నన్ను పూర్తిగా కట్టి పడేస్తుంది."

"గుడ్! నువ్వు జీవితంలో రాజీపడ్డావు" నిజంగానే మెచ్చుకున్నాడు శ్యామ్.

"నా కిప్పుడు జీవితంలో నేను కోరుతున్నది దొరక్కపోయినా ఎలాంటి అసంతృప్తిలేదు" అని లేచి నిల్చొన్నాడు సురేంద్ర.

## 5

"శ్యామూ!" ఇంచుమించుగా పరిగెత్తుకొచ్చింది సుహాసిని.

సుహాసినిలో ఏమీ మార్పులేదు. అదే ఛలాకితనం – అదే ఆప్యాయత – ఐదేళ్ళ దూరం తర్వాత కాస్త ఆశ్చర్యకరమైన విషయమే ఇది.

"వ్రాయలేదేం వస్తానని !" అంటూనే శ్యామ్ ముందుకు కుర్చీ జరిపి లోపలికి కేకేసింది.

"శ్రీవారూ ! నా స్నేహితుడు వచ్చాడు ఇలా రండీ ..."

శ్యామ్‌శేఖర్ ఉలిక్కిపడ్డాడు. ఆమె తనని స్నేహితుడనిచెప్తోంటే.... 'ఈ భారతదేశంలో అందులోనూ ఆంధ్రాలో స్నేహపాత్రుడైన ఒక మగవాణ్ణి స్నేహితుడు అని చెప్పుకోగల ఆడపిల్లలు కూడా వున్నారా ? అందులో భర్తకి !'

"ఫర్వాలేదు. కాలం మారింది" అని నవ్వాడు శ్యామ్‌శేఖర్.

"ఎందుకలా స్టేట్‌మెంట్స్ పారేస్తున్నావు" అంది తన కుర్చీ కూడా ప్రక్కకు జరుపుకుని కూర్చుంటూ సుహాసిని.

"మీ ఆయనకు నన్ను స్నేహితుడిగా పరిచయం చేస్తుంటేనూ...."

"కాలం మారలేదు శ్యామూ ! మా ఇంట్లో వాతావరణం ఈ సమాజపు గాలితో కల్మషం కాలేదంతే"

సుహాసిని భర్త వచ్చాడు. నోట్లో బ్రష్‌తో శ్యామ్ చాలా నిరాశపడ్డాడు, అతః ా ఏమీ బాగలేడు.

అతను నమస్కారంపెట్టి ఇప్పుడే వస్తానని లోపలికెళ్ళాడు.

"చూః శ్యామూ ! ఇష్టమైన వ్యక్తితో స్వేచ్ఛగా మాట్లాడుకునే పవర్స్ ఈ ఇంట్లో నాకున్నాయి. ఎవరికో భయపడి నేను నిన్ను అన్నా ! అని పిలవాల్సిన పనిలేదిక్కడ....వుండు మొదట కాఫీ తెస్తాను" అని లోపలి కెళ్ళిపోయింది సుహాసిని.

తనని తనూహించనిగోళంలోకి నెట్టినట్టుగా అన్పించింది శ్యామ్‌శేఖర్‌కు. అతను సుహాసిని భర్తను ఛాలా అందంగా ఊహించాడు.

అతను ఇంచుమించు సుహాసినంత పొడవే వున్నాడు. పేలవమైన చామనఛాయతో సన్నగా, పీలగా వున్నాడు. ఆ నడకలో బొత్తిగా స్టైల్ లేదు. ఆ పలకరింపులో స్టైల్ లేదు. డ్రస్సింగ్‌లో స్టైల్ లేదు. అంతా సామాన్యంగా, మామూలుగా వుంది.

చాలా బలంగానే నిరాశపడ్డాడు శ్యామ్‌శేఖర్. తన స్నేహితురాలి అసంతృప్తిని వూహిస్తున్నాడతను.

"సారీ! మిమ్మల్ని ఒంటరిగా కూర్చోబెట్టాను శ్యామ్" నొచ్చుకుంటూ వచ్చి కూర్చున్నాడు సుహాసిని భర్త సుబ్బారావు.

"ఫర్వాలేదు నేనే చాలా ప్రొద్దున్నే వచ్చేశాను."

వాళ్ళిద్దరూ రాజకీయాల్లోకి, ప్రస్తుత సమాజంలోకి, తమ ఆఫీస్ గొడవల్లోకివెళ్ళి చాలాసేపు మాట్లాడారు. మధ్య మధ్యలో సుహాసిని వచ్చినా సుబ్బారావు ఆమెనంతగా పట్టించుకోలేదు. ఆమె మాట్లాడేదాన్ని అభ్యంతరం పెట్టలేదు.

"నాకీరోజు ఓ ఐదు నిముషాలు ఒకరింట్లో పనుంది వెళ్ళొస్తాను" అని లేచి "పోనీ మీరూ రండి అలా ఊరు చూసినట్లయినా వుంటుంది" అని అంటున్న భర్తను వారించింది సుహాసిని.

"రాకరాక వస్తే శ్యామ్ మీతో ఎందుకు? మేమిద్దరం కబుర్లు చెప్పుకుంటాం మీరెళ్ళిరండి"

"ఓ. కె" అని అతను వెళ్ళబోతున్నాడు.

"లేదు. నేనూ వస్తాను మీ రన్నట్టు నేనింకా ఊరే చూడలేదు" అనేసాడు శ్యామ్ చప్పున. సుహాసిని సాహసం తనకు తెలుసు. తనవల్ల వాళ్ళిద్దరిమధ్య కలతలు రావడం శ్యామ్ కిష్టమైన సంగతి కాదు.

సుబ్బారావు లోపలి కెళ్ళాడు.

"శ్యామూ ! నా పెళ్ళికి నిన్ను పిలవలేదని కోపంగా లేదూ?" అంది సుహాసిని.

"కోపం రాలేదుకానీ, ఎందుకు పిలవలేదు ?" ఐదేళ్ళ తర్వాత ఈ ప్రశ్న అడుగుతున్న స్నేహితుణ్ణి ప్రీతిగా చూస్తూ ఆమె చెప్పిన న్యూస్ అతన్ని షాక్‌లోకి తోసింది.

"పిలవడానికి అవకాశం లేకపోయింది శ్యామూ ! బిడ్డనికని మా అక్క చనిపోవడం, అక్క కర్మ క్రతువుల పందిట్లోనే బావతోనే నా పెళ్ళి జరిగిపోవడం, ఆ దిగుల్లో నే నెవరికి చెప్పుకోగలను చెప్పు ? ! అయ్యయ్యో కూర మాడిపోయినట్టుంది వస్తా నుండు" అని లోపలికి పరుగు తీసింది.

ఇది శ్యాము జీవితంలోకల్లా పెద్ద షాక్. 'కర్మ క్రతువుల పందిట్లో పెళ్ళా ? ఈ రోజుల్లో కూడా ఇంకా ఇవి జరుగుతున్నాయా ?' అతనిలో కొండంత విభ్రాంతి.

'సుహాసినికి రెండో పెళ్ళా ? అందులో కర్మపందిట్లో పెళ్ళా ?' వెంటనే అతనికి తన చెల్లెలి పెళ్ళి గుర్తుకొచ్చింది.

* * *

"శ్యామూ ! నీ చెల్లెలి పెళ్ళి నువ్వు ఇలా చేస్తావనుకోలేదు" తనేదో పనుల హడావుడిలో వుంటే విసురుగా వచ్చి ఇంకా విసురుగా అడిగింది సుహాసిని.

"ఏమయింది ?" తెల్లబోతూ అడిగాడు తను.

"పట్టుచీరలు, ఖరీదైన నగలు ఎగ్జిబిషన్‌లావుందిగానీ పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు గుండెల్లో పులకరింతల జల్లులు కురిసేలా స్నేహితులు హాస్యోక్తులు విసురుతున్నారా ?"

"హాస్యాలా ! అంటే"

"ఛీ. నీకు చెప్పుకునేకంటే ఆ గోడకు చెప్పుకోవచ్చు. "చూడూ ! అందరూ వాళ్ళిద్దర్నీ ఆ పొగలో ఆ పీటలమీదపడేసి ఆ ఛొక్కాలేని పంతులపరం చేసారు. ఎంతసేపటికీ అతిధులకు ఫలహారాలందించడానికి మనం పెట్టుకొచ్చిన నగలు, కట్టుకొచ్చిన చీరలు గురించి ముచ్చటించు కోను అటెండెన్సు వేయను వచ్చిన జనం.... ఛీ ఛీ."

సుహాసిని స్నేహితురాలు ప్రవీణ నవ్వింది.

"ఏమయింది సుహాసినీ !" నిదానంగా అడిగాడు శ్యామ్‌శేఖర్.

"ఏమైందా ? మేమేదో పెళ్ళికొడుకుమీద జోక్ విసరబోతే మీపెద్ద వాళ్ళకది పెద్ద తప్పయిపోయింది."

అతను ఏదో లిస్టు వ్రాసుకుంటున్నవాడల్లా తలెత్తి ఒక్కసారి సుహాసినివంక చూసి మరలా తల దించుకుని వ్రాయడం సాగించాడు. అతని దగ్గర సుహాసినికివ్వను సంజాయిషీలేదు. పెద్దవాళ్ళను అతను కాదనలేడు. అతను ఈ ఇంటికి పెద్దకొడుకు.

స్నేహితుడి సంగతి తెల్సిన సుహాసిని నిట్టూర్చి అక్కడే నేలమీద చతికిలబడి కూర్చుంది.

"అక్కడ కూర్చున్నావేం ? ఆ స్టూలు లాక్కుని కూర్చో" అన్నాడు శ్యామ్‌శేఖర్. ఆ రూములో ఆ పనీ, ఈ పనీచేస్తూ ఇంకా నలుగు రైదుగురు మనుష్యులు కూడా వున్నారు.

"పర్వాలేదు మర్యాద – కూర్చోవే" అని ప్రవీణ చెయ్యిలాగి కూలేసింది సుహాసిని. భోజనాలకు పిలుపు వచ్చింది. భోంచేసి వచ్చేసరికి ప్రక్కరూమ్‌లో పెళ్ళికూతురికి నగలు తీసే ప్రోసెస్‌లో వున్నారు ముత్తైదువలు.

"అలంకరించడం, పని పూర్తయినందుకు సంతోషపడడం, తర్వాత వాటిని పీకేయడం" అంతే వాటిపని.... చాలాకోపంగా వుంది సుహాసినికి.

"వీణా ! అస్సలు మన పెళ్ళిళ్ళల్లో పెళ్ళికూతురికి, పెళ్ళికొడుక్కి కూడా అనుభూతులుండకుండా చేస్తారీ పెద్దవాళ్ళు. అసలు పెళ్ళిమండపంలో వాళ్ళిద్దరిమీదా జోక్స్ వేస్తుంటే పెళ్ళికొడుకు, పెళ్ళికూతుర్ని మోచేత్తో 'విన్నావా' అన్నట్టు పొడిస్తే పెళ్ళికూతురు సిగ్గుతో తలవంచేస్తే ఓ .... ఆ థ్రిల్ జీవితాంతం గుర్తుండిపోవాలి. కానీ మనవాళ్ళకు అంతటి రసానుభూతులుంటాయా ? వాళ్ళకుండకుంటే మానె ఆ క్రొత్తజంటకుకూడా వుండదనుకుంటారు కాబోలు .... పెళ్ళి చేసెయ్యడం - ఎప్పుడో అర్ధరాత్రికి కళ్ళమీద నిద్రొచ్చే టైమ్‌లో వాళ్ళ పనులన్నీ సర్దుకుని స్టోర్‌రూమ్‌ని బెడ్‌రూమ్‌గా మార్చి వాళ్ళిద్దర్నీ త్రోసేయడం నేస్టీగా, పైగా ఆ రూమ్‌చుట్టూ జనం."

ప్రవీణ మాట్లాడలేదు.

"అసలు వీణా ! పెళ్ళికాగానే ఆ జంటకు ఓ ఫస్టుక్లాస్ టిక్కెట్ తీసిచ్చి వాళ్ళను ఒంటరిగా తరిమేయాలి, ఆ ట్రిప్‌లోని ఆనందాన్ని వాళ్ళు జీవితాంతం నెమరేసుకుంటారు. అంతేకానీ ఇలా ఆ అబ్బాయికి జంకు కల్గించేలా మొరటు సరసం పేర రూములోకి తొంగిచూడ్డం - ఇవన్నీ ఎంత ఘోరమో కదా !"

సుహాసినిలో ఎంత ఆవేశం ఆ రోజు !

నిట్టూర్చాడు శ్యామ్‌శేఖర్.

ఆ రోజు ప్రవీణ కాబోలు అంది.

"కూల్‌డౌన్ డియర్ ! ఆంటీతో చెప్పి నీ పెళ్ళి నీవు కోరుకున్న రీతిలో చేస్తాము - నీ పెళ్ళి అయ్యాక ఒక్కక్షణం మేముండం, నిన్ను మీ శ్రీవారిపరంచేసి మేమెళ్ళిపోతాం"

"ప్లీజ్ ! అలా చెయ్యవే" అనేసింది సుహాసినారోజు.

"మీరు వస్తారా ? వుంటారా ?" ఇస్త్రీ చేసిన గజిబిజి డిజైన్ లుంగీ పొడుగుచేతుల ముక్కాపొడుంరంగు షర్టు వేసుకుని తల ఎగదువ్వి వచ్చిన సుబ్బారావు పలకరింపుతో తేరుకుని లేచాడు శ్యామ్‌శేఖర్.

"మళ్ళా వస్తాను సుహాసినీ !" అనేసి వెళ్తున్న స్నేహితుణ్ణి చిరునవ్వుతో చూసింది సుహాసిని.

# 6

సుహాసిని భర్త అతని స్నేహితునికి శ్యామ్‌శేఖర్‌ని పరిచయం చేసాడు. "మీరు మాట్లాడుతూ వుండండి ఇప్పుడే వస్తాను" అని బయటపడ్డాడు శ్యామ్‌శేఖర్. అతనికి చాలా అశాంతిగా వుంది. తన స్నేహితురాలి పెళ్ళి ఉదంతం ఏమీ నచ్చలేదు. పైగా సుహాసిని పెళ్ళి. ఆమెలో ఎన్ని కోరికలు ! ఎన్ని కలలు ! ఆమెలో ఎంత అసంతృప్తి ! సుహాసిని అమ్మావాళ్ళు ఎంతలా హింసించి సుహాసినికి పెళ్ళి చేసారో ! అప్పుడు ఎంత బాధపడిందో పిచ్చిపిల్ల !

ఈ సంప్రదాయాలే చెడ్డవి. ఎవరికొరకో, దేనికొరకో అన్నట్టు చేస్తారు పెళ్ళిళ్ళు ! ఒకరి తోడుకొరకు ఒకరు - అనేభావం వుండదు. సుహాసిని అక్క ఓ బిడ్డను కని చనిపోవడం - ఆ బిడ్డకు తల్లి అవసరం. ఆ తల్లి మరెవరో అయితే బాగా చూడదు. అందుకు ఆ స్థానానికి సుహాసిని అవసరం. ఆ వేడితగ్గితే పెళ్ళికి ఒప్పుకోదని బావమీద, అక్కబిడ్డమీద సానుభూతి తగ్గకముందే చావు పందిట్లో పెళ్ళి చేసేయడం ! ఛీ - ఛీ శ్రీకాళహస్తీశ్వరుడి దేవాలయంలో విశాలమైన కాంపౌండ్‌లో మెట్లమీద కూర్చొని విసుక్కున్నాడు శ్యామ్‌శేఖర్.

చాలా సేపటికి తృళ్ళిపడ్డట్టుగా లేచి హడావుడిగా సుబ్బారావు స్నేహితునింటికెళ్ళాడు. శ్యామ్ ఊహించినట్టుగానే సుబ్బారావు శ్యామ్ కొరకెదురు చూస్తున్నాడు. శ్యామ్‌కి అనవసరంగా సుబ్బారావంటే విముఖత్వం ఏర్పడింది. కారణం - తన స్నేహితురాలు సుహాసిని భర్త రూపం కావచ్చు రెండో పెళ్ళికొడుగ్గా, చావు పందిట్లో ఎలాంటి అనుభూతులూ లేకుండా తన స్నేహితురాల్ని పెళ్ళి చేసుకున్నాడనే భావమూ కావచ్చు.

"సారీ!" పొడిగా చెప్పి అతనితో కదిలాను.

"నేనే చెప్పాలి సారీ నాకింకో పని తగిలింది. నేను తర్వాత వస్తాను మీరింటికి వెళ్ళిపోగలరా ?"

ఈసారి వెంటనే ఒప్పేసుకున్నాడు శ్యామ్‌శేఖర్. "ఈ సుబ్బారావు లేకుండా సుహాసినితో మాట్లాడాలి. పాపం ఎంత అసంతృప్తి ఫీల్ అవుతోందో ! కాస్త ఓదార్చాలి. సుహాసినిలో ఎన్ని కోరికలో ! ఎన్ని కలలో ! అన్నీ - అన్నీ ఎంత దుర్మార్గంగా సమాధి చేయబడ్డాయి ! ఈ పెద్దవాళ్ళు ఎంత క్రూరులు !"

'ఏం పెళ్ళి అది ! నిశ్శబ్దంగా, భారంగా కన్నీళ్ళతో ఏదో తప్పదన్నట్లు అటెండెన్సు ఇచ్చేదగ్గర బంధువులు ఎలాంటి స్పందనలూ లేకుండా ఆ చావు పందిట్లో పెళ్ళిపీటలమీద పెళ్ళిజంట - ఒకవేళ గుండెల్లో నును సిగ్గు రేగినా, బయటకు చూపించుకోలేని చావు నిశ్శబ్దం ! ఏం మునిగిపోయిందో ! పోనీ... ఓ సంవత్సరం ఆగి చేసుకున్నా రెండో పెళ్ళయినా అదోదారి, ఆ స్పందనలే వేరు.

'ఈ పెద్దలంతా కలిసి సుహాసిని తాలూకు మధురమైన పెళ్ళిరోజును ఎంత క్రూరంగా దోచుకున్నారు ! పాపం - సుహాసిని !'

దోవ పొడుగునా శ్యామ్‌శేఖర్ గుండెలు సుహాసిని పెళ్ళిని ఊహించి మండిపోతూనే వున్నాయి.

అసలు పందింట్లో పెళ్ళి చేయడంలో ఈ సంప్రదాయం ఉద్దేశ మేమిటి ? భార్యపోయిన మగవాడికి మరో తోడును వెంటనే వెతికిపెట్టి అతని బాధను పోగొట్టుకోవాలనే సదుద్దేశమా ! అదే అయితే మంచిదే కానీ అదే సుబ్బారావు చనిపోయి నీరజ బ్రతికుంటే యిలానే ఆలోచించేదా ఈ సమాజం ?

ఎంత పక్షపాతం ఈ సమాజానికి ? పూర్వీకుల్ని అనుసరించడమే గానీ స్వంత ఆలోచనలు లేని ఈ యువతరం ఎంత అధమస్థితిలో వుంది!

శ్యామ్ గుండెలు మండిపోతూనే వున్నాయి.

## 7

"సుహాసినీ ! నువ్వీపెళ్ళి ఇష్టపడే చేసుకున్నావా ?" నేరుగా అడిగాడు శ్యామ్‌శేఖర్.

ఇష్టపడే చేసుకున్నానన్నట్టు నవ్వి తలూపింది సుహాసిని.

"నీకీ జీవితం తృప్తిగా వుందా ?"

తృప్తిగా వుందన్నట్టు మళ్ళీ తలూపింది.

ఆమె నవ్వులోనూ, జవాబులోనూ నిజాయితీని శంకించాడు శ్యామ్ !

"నిజంగానా ? నన్ను మోసం చేస్తున్నావా ?"

ఈసారి పెద్దగా నవ్వింది. 'ఉండు ఇప్పుడే వస్తాన'ని లోపలికెళ్ళి పనేదో పూర్తిచేసి ఐదు నిముషాల్లో వచ్చి అతనికెదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది సుహాసిని.

"నువ్వు అలా ఆశ్చర్యపోవడంలో, నమ్మకపోవడంలో ఆశ్చర్యం లేదు. అతనిది నేను కోరుకున్న రూపంకాదు నేను కోరుకున్న స్టయిల్ అతనిలో లేదు. పేరు కూడా సుబ్బారావు" అని మరలా నవ్వింది సుహాసిని.

శ్యామ్ మాట్లాడలేదు. అతనికి సుహాసిని అలా తృప్తి పడిపోవడం చాలా ఆనందంగా వున్నా – సుహాసిని అబద్ధం చెప్తుందేమోననే అనుమానం మాత్రం వుంది.

"శ్యామూ! చదువుకునే రోజుల్లో ఆవేశంగా, నిర్భయంగా నా కోరికను వెల్లడించగల్గిన నేను అదే ఆవేశంతో ఆలోచనా రహితంగా బావకు నా అంగీకారాన్ని తెల్పానేమోనని పెళ్ళయిన కొత్తలో నేను బాధ పడిన మాట వాస్తవమే" నవ్వటం ఆపి విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటూ మొదలెట్టింది.

"అక్క ప్రేమను, అక్క జ్ఞాపకాలను, అక్క తాలూకు ప్రతి కదలికనూ తల్చుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చే సమయంలో ఇటు నేను, అటు బావ కూడా పెళ్ళిపీటలమీద కూర్చున్నాము శ్యామూ. అయ్యో! సుబ్బారావు నొసట రెండోపెళ్ళి జరగాలని వ్రాసుంది కాబోలు, చదువుకున్నపిల్ల జ్ఞానమెరిగి సరేనన్నది కాబట్టి ఆ పసికందు అదృష్టవంతురాలైంది. పోనీ పాపం నీరజ జ్ఞాపకాల్లో వుండకుండా ఈ కర్మ క్రతువుల పందిట్లోనే పెళ్ళి జరిగేలా వ్రాసాడా భగవంతుడు."

"హాస్యోక్తుల బదులు ఇలాటి సానుభూతి మాటలు వింటూ సిగ్గు తెరలమధ్య జరగాల్సిన నా పెళ్ళి కన్నీటి తెరలమధ్య జరిగిపోయింది."

"పెళ్ళవగానే ఫస్ట్‌క్లాస్ టికెట్టు కొనిచ్చి వధూవరులను తరిమేయాలన్న థియరీలో వున్న నేను ఆ రోజు రాత్రి మంచానికి మరోవైపు కూర్చొని మూగగా అక్కను తల్చుకుని బావతోపాటు రోదించాను."

"ఎన్నో కోర్కెలతో భర్త ఒడిలో తల పెట్టుకుని క్రొత్త తీరేలా అతని కబుర్లు వింటూ అతని లాలనలో ఐక్యం కావాల్సిన నేను—"

"ప్లీజ్ సుహాసినీ! ఏడవకు మీ అక్క జ్ఞాపకాలు నన్నూ

బాధిస్తున్నాయి. ఏం చేస్తాం" అనే అతని ఓదార్పులో నేను లీనమయి పోయాను.

"శ్యామూ ! హనీమూన్‌లో సెకండ్లలాగ గడచిపోవాల్సిన రోజులు ఇంట్లో అతి మామూలుగా, యాంత్రికంగా, భారంగా జరిగిపోయాయి."

శ్రీవారితో 'మీరు నన్ను తల్లిని చేయబోతున్నారు' అని ఎంతో బిడియంగా, సిగ్గుగా చెప్పాల్సిన నేను — ఏ అనుభూతి లేకుండా అక్క పాపను ఒళ్ళో వేసుకున్నాను. భార్యనూ, తల్లిని ఒకేసారయ్యాను.

ఇవన్నీ ఒకెత్తయితే శ్యామూ ? అక్క సంసారం నాదయిందే అనే గిల్టీనెస్ మరో ఎత్తయింది.

'స్నానానికి నీళ్ళు తోలిపెయ్ వస్తున్నాను' అని అతను అనగానే ఒకనాటి అక్క, బావల బాత్‌రూమ్‌లో సరసం కళ్ళకు కట్టినట్లనిపించేది. నేను కాలేజీ నుంచొచ్చి కాళ్ళు కడుక్కుందామని బాత్‌రూమ్ కెళ్ళేసరికి అక్క బావకు తలంటి స్నానం చేయిస్తోంది ఒకరోజు. బావ షాంపుచేత్తో అక్కను చుట్టేసి దగ్గరకు తీసుకుంటున్నాడు — అక్క 'అయ్యో ! నా చీరంతా తడిసిపోతుందండీ వదలండీ' అని మురిపెంగా అంటోంది.

'వదలనే వదలను. ఈ చాన్స్ తప్పిపోతే నువ్వింక దొరకవు. అబ్బ నెలరోజులైందోయ్ నువ్వు లేకుంటే అన్నం తిన్నట్లేలేదు, స్నానం చేసినట్లేలేదు. ఆఫీసునుండి రావాలనేలేదు. రాత్రిళ్ళు...."

'ఊర్కోండి మీరు మరీనూ ఎవరైనా వస్తారు. ఇది మనిల్లను కున్నారా ? అక్కడయితే మనిద్దరమే ఏ అల్లరయినా సాగుతుంది !' ముచ్చటగా వారిస్తోంది.

సుహాసిని తల వంచుకుని చెప్తోంది. శ్యామ్‌శేఖర్ వింటున్నాడు. ఇలాటి సంభాషణకు ఇద్దరిలోనూ బిడియంలేదు. ఒకరకం ఆవేదన.

"ఆ రోజు వాళ్ళను చూసి ముచ్చటపడి గిరుక్కున వెనక్కు తిరిగి ఇంట్లో కెళ్ళానుగానీ అది గుర్తు వచ్చినప్పుడల్లా బావ పిల్చినప్పుడు వెళ్ళి ఆయనకు తలస్నానం చేయించలేకపోయేదాన్ని."

'సుహాసినీ! అన్నం వడ్డించు ఆఫీసుకు టైం అయింది' అని అతనంటే—

నేను పెట్టిందేదయినా 'చాలా బాగా చేసావ్ సుహాసినీ' అని సంతృప్తిగా బావ తిని వెళ్ళిపోతే – నాలో ఏదో వెల్తి – అతని ఈ రెండో ప్రేమమీద అనుమానం—

నిద్రపోయిన పాపను ఉయ్యాల్లో పండేసి అలా మంచంమీద వాలి మొద్దునిద్రలోవున్న నన్ను అతిసున్నితంగా—

'సుహాసినీ! నిద్ర పట్టేసిందా? పాప బట్టలు తడిపేసుకున్నట్టుంది చూడవా?' అని అతను ఆఫీసునుండి వచ్చి పిలిస్తే భోరున ఏడ్చే నన్ను చూసి విస్తుపోవడం బావ వంతయ్యేది.

'ఏమయింది సుహాసినీ! నే నేదయినా నీ మనస్సు నొప్పించానా?' అని అతను లాలిస్తే—

'బావా! నేను పాపకు న్యాయం చేకూర్చలేకపోతున్నానేమో' అని గిల్టీగా ఫీల్ అవుతూ నా తప్పు ఒప్పుకునేదాన్ని.

"ఏమిటిది! మీ అక్క వున్నా ఆదమరచి నిద్రపోదా?' అని నన్ను ఓదార్చినా నా గిల్టీనెస్ పోయేదికాదు.

"అతను నన్ను దగ్గరకు తీసుకోబోయే క్షణంలో ఈ చేతుల్తో అక్కనూ దగ్గరకు తీసుకున్నాడుకదా! ఎంతలో అక్కను మర్చిపోయి నన్ను దగ్గరకు తీసుకుంటున్నారు అనే కఠోర సత్యం నన్ను తినేసేది."

"శ్యామూ ! బహుశా బావ అక్కను మర్చిపోకపోవచ్చు. నా కెక్కడ అన్యాయం జరుగుతుందోననే శంక అతనిలో వుండి నాకు న్యాయం చేకూర్చాలని నన్ను తన జీవితంలోకి – సంతోషంగా ఆహ్వానిస్తున్నట్టు నటించొచ్చు కానీ....కానీ నాకు అతని చేతుల్లో అక్కే మెదిలేది. అందుకే మనస్ఫూర్తిగా అతని ఆహ్వానాన్ని అందుకోలేక పోయేదాన్ని."

"బావ ఆఫీసుకు వెళ్ళగానే ఆలోచించేదాన్ని.... ఆ ఆలోచనలకు అంతుండేదికాదు."

ఎవరు నన్ను అన్యాయం చేసారు ? బావా ? అమ్మా ?....నో.... నో....నా కన్యాయం జరిగిందంటే నా మనస్సాక్షి అఖరుకు అంగీకరించేది కాదు శ్యామ్ !

'సుహాసినీ !' అంటూ ఎప్పుడూ పిల్చేబావ,

నా కళ్ళల్లో అసంతృప్తిని గ్రహించి నన్ను ఓదార్చే అతను,

తన కళ్ళల్లో దైన్యాన్ని నా సంతోషంకోసం దాచుకునే బావ.

నా వైవాహిక జీవితంలో నా మనసెరిగి తన కోరికలకు కళ్ళెం వేసే అతను, ఒక్కసారైనా పరుషంగా మాట్లాడి నొప్పించని బావ,

అతనికోసం నేను మారాలి – నాలోని అసంతృప్తిని పార ద్రోలాలి.

బావ ఆఫీస్‌నుండి రాగానే మనస్ఫూర్తిగా అతనందించే పూలపొట్లాం అందుకోవాలి, అతని చేతుల్లోకి ముద్దుగా ముస్తాబుచేసిన పాప నందించి పాప ఆటల్లో కొంత సమయం గడపాలి, వేడిగా టిఫినుప్లేటు అతని

కందించి కబుర్లుచెప్తూ కూర్చోవాలి – బావ గుండెల్లో ఒదిగిపోయి ప్రశాంతంగా బ్రతకాలి – అతని కోరికలకు నా ఉత్సాహం వుండాలి – ఇలా నా ఊహల బ్రతుక్కి తెరవేసి – అక్క జీవితం దోచుకున్నాననే శంకను వదిలేసి బావ ప్రేమను శంకించక నిజజీవితంలో మనస్ఫూర్తిగా బావ మంచితనానికి లొంగిపోయి రాజీపడిపోయాను" అనేసి కాస్సేపాగి–

"శ్యామూ ! నా జీవితంలో ఇప్పుడు ఏ అసంతృప్తీలేదు. 'బావ కంటే ఇంకా నన్ను బాగా చూసుకునే భర్త దొరికుండడు' అనే భావన తప్ప—"

వేడెక్కిన వాతావరణం చల్లబడింది. శ్యామ్‌శేఖర్ మనస్సు కూడా క్షణాల్లో ప్రశాంతంగా మారిపోయింది.

"అరె ! ఇంకా ఇలానే కూర్చున్నారా ? భోంచేసేయకూడదూ ? ఎంత త్వరగా రావాలని ప్రయత్నించినా వీలుకాలేదు. 'సారీ' శ్యామ్‌శేఖర్ గారూ !" వస్తూనే సంజాయిషీ ఇచ్చాడు సుబ్బారావు.

"పర్వాలేదు ఇప్పుడేమయింది? అందరం కలసి సరదాగా భోంచేద్దాం" సుబ్బారావుకెదురెళ్ళి అతని రెండుచేతులు పట్టుకుని అన్నాడు శ్యామ్‌శేఖర్.

క్షణం క్రితంవరకు అతనిమీదున్న అనవసర కోపం తగ్గిపోయింది. అతని సంస్కారానికి ముగ్ధుడయ్యాడు.

* * *

"అదేంటి శ్యామూ ! ఒక్కరోజైనా వుండకుండా వెళ్ళిపోవడమేమిటి ?" వక్కపొడి అందిస్తూ అంది సుహాసిని.

"లేదు సుహాసినీ ! వెళ్ళాలి - నీ సంసారం చూసాను. నీ జీవితం బాగుంది. నాకు చాలా సంతోషంగా వుంది."

"ఇదిగో నా జీవితం గురించి కాదు నీ జీవితం గురించే ఆలోచించే రోజు వచ్చేసింది - ఓ అందమైన అమ్మాయిని చూసి చేసుకో."

"అందమైన అమ్మాయనే అక్కరలేదు సుహాసినీ ! నీలాగ జీవితంలో 'రాజీ' విలువ గుర్తించే అమ్మాయి చాలు నాకు" నవ్వుతూ అనేసి భార్యాభర్తలకు వీడ్కోలిచ్చాడు శ్యామ్‌శేఖర్.

F 22161